క్లుప్తంగా

ఇల్లు దగ్ధం

పెద్దవూర: లోఓల్టేజీతో విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం పెద్దవూర మండలం పొట్టివానితండాలో జరిగింది. వివరాలు.. పొట్టివానితండాకు చెందిన దివ్యాంగుడు రమావత్ బిచ్చు శుక్రవారం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోఓల్టేజీతో విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించాయి. దీంతో బిచ్చు ఇంట్లోని ఫ్రిడ్జ్, కూలర్, ఫ్యాన్లు, బియ్యం, వడ్లు, సామగ్రి, మంచాలు, దుస్తులు దగ్ధమయ్యాయి. తనకు ఒంటిపై బట్టలు తప్ప ఏమీ మిగలలేదని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ

మిర్యాలగూడ : పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌కు సామాజిక సేవకుడు, ఎన్ఆర్ఐ చెరుపల్లి శ్రీనివాస్ శుక్రవారం రెండు కంప్యూటర్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశుమందిర్ సమితి అధ్యక్షుడు ఏచూరి మురహరి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు గౌరు దయాకర్, రేపాల లక్ష్మీకాంతం, కంచర్ల అనంతరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, యామిని వెంకటేశ్వర్లు, గూడూరు శ్రీనివాస్‌రావు, ప్రధానాచార్యులు చెన్నూరు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాల్లో వసతులు కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో రూ.3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కమ్యూనిటీ భవనాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం భవనాల్లో పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆ భవనాల్లో ఏఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయో చూసి వాటిని వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ డీఈఈ వెంకన్నను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ నవీన్ తదితరులున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మాడుగులపల్లి : కార్మికుల హక్కుల కోసం ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాగయ్య, తంగెళ్ల నాగమణి, వెంకటాచారి, బొంగర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు



సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యోగా సాధకులు

మిర్యాలగూడ టౌన్ : బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన భారతీయ విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు అని యోగా సాధకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో పతంజలి యోగా సాధకుల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా లక్ష్మయ్య, కె. రాచయ్య, కేవీ సుబ్బారావు, గోవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, బి. శ్రీనివాస్, శంకర్‌నాయక్, ఎన్. శ్రీనివాస్, శివశంకర్, వరలక్ష్మి, వాసవి ఉన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

హాలియా : పేదవారికి నాణ్యమైన విద్యను కల్పించాలంటే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం అన్నారు. టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ క్యాంపెయిన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, ఎస్‌కె సయ్యద్ మీయా, జిల్లా కార్యదర్శి రమాదేవి, సీనియర్ కార్యకర్తలు సరిత, వీరాసింగ్, ప్రసాద్, వెంకటేశ్వరరావు, సునిత, కోశాధికారి చంద్రయ్య ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

త్రిపురారం : మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక కళాకారుడు కలకొండ శ్రీను(బొట్టు శ్రీను) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మాటూర్‌లో శ్రీను మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి రూ. 10వేలు, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి రూ. 10వేలు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి రూ. 5వేలు శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థికసాయంగా అందజేశారు.

ఆ దారిలో వెళ్తున్నారా.. జాగ్రత్త!





నాగార్జున సాగర్ జాతీయ రహదారిలో ఎస్ ఆకారంలో ఉన్న మూలమలుపులు

సాగర్ జాతీయ రహదారిలో ప్రమాదకర మూలమలుపులు

- పదుల సంఖ్యలో ప్రమాద కేంద్రాలు
- ఘాట్ సెక్షన్‌లో తక్కువ వెడల్పులో రహదారి
- కానరాని సూచిక బోర్డులు

నాగార్జునసాగర్ : సాగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారి మూలమలుపులు ప్రయాణికుల ప్రాణాలను హరిస్తున్నాయి. అధిక వాహనాల రాకపోకలు, ఘాట్ సెక్షన్లలోని మూలమలుపులలో వెడల్పు లేని రహదారి నిర్మాణం, తగిన సూచికలు లేకపోవడం వల్ల ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ వైపు నుంచి నాగార్జునసాగర్‌కు వచ్చే వారికి ముందుగా సమ్మక్క–సారలక్కల వద్ద గల మూలమలుపు ఉంటుంది. అది దాటాక ఒక పక్క సాగర్ జలాశయ తీరం మరో పక్క అటవీ అటు లోయ ముందు ఎస్ ఆకారం మూలమల్పు ఉంటుంది. దాన్ని దాటగానే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్న దయ్యాలగండి మూలమలుపు ఉంటుంది. అనంతరం మరో ఎస్ ఆకారం మూలమలుపు వస్తుంది. అనంతరం ఎదురుగడ్డ ఎక్కగానే నెల్లికల్లు గేటు మూలమలుపు వస్తుంది. అది దాటాక పాత కంకర మిల్లు మూల మల్పు వస్తుంది. ఇక్కడ ఇటీవల వారంలో రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి. అది దాటగానే ఎగువ భాగంలో మత్స్యకారుల దారి దిగువన మూలమలుపు ఉంటుంది. అనంతరం హిల్‌కాలనీ ముత్యాలమ్మ గుడి మూలమలు, ఇది దాటాక నెహ్రూ పార్కు వెంట మూలమలుపు, పాత ఫిల్టర్ హౌస్ దాటుతుండగానే మరో మూలమలుపు ఉంటుంది. అనంతరం సత్యనారాయణ స్వామి గుడి దిగువన మూడు రోడ్ల ఇందిరమ్మ కూడలి దాటగానే జలాశయం తీరం వెంట రోడ్డు మూలమలుపు, కొంత దిగువకు డౌన్‌లో వెళ్తే వెళితే పైలాన్ కాలనీ ముత్యాలమ్మ గుడి మూలమలుపులు ఉంటాయి. అది దాటితే ఎర్త్‌డ్యాం దిగువన ఎస్ ఆకారం మూలమలుపు, ఇది దాటగానే పోలీస్ ఫరెడ్ గ్రౌండ్ మూలమలుపు వస్తుంది. అనంతరం మూడు రోడ్ల కూడలి. ఇది దాటితే జెన్‌కో కార్యాలయం మూలమలుపు, తర్వాత సాగర్ డ్యాం దిగువన గల నదిపై నిర్మించిన కొత్త వంతెన వస్తుంది. ఇలా పదుల సంఖ్యలో మూల మలుపులు ఉన్నాయి.

పుణ్యస్నానాలకు భక్తులు రాక

నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక ప్రదేశమే కాకుండా ఆధ్యాత్మికంగా ఎన్నో దేవాలయాలు కృష్ణా నదీతీరంలో ఉన్నాయి. వీటి సందర్శనార్థం నదిలో స్నానాలు చేయడానికి ముఖ్యమైన పండుగలపుడు చుట్టు పట్టు గ్రామాల ప్రజలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు గ్రామాల ప్రజలు సాగర్‌కు వచ్చి పోతుంటారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అటవీ ప్రాంతంలోని మూలమల్పులను ఆంధ్ర ప్రదేశ్‌లోని మాచర్లకు వెళ్లే రోడ్డుకు చేసినట్లు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేదంటే ఈ మార్గం మరిన్ని కుటుంబాలకు కన్నీటిని మిగుల్చుతుంది.

జాగ్రత్తగా వాహనాలు నడపాలి



నాగార్జునసాగర్‌కు వచ్చే ప్రయాణికులు వాహనాలను నెమ్మదిగా నడపాలి ఘాట్‌సెక్షన్‌లో 10కే ఎంపీహెచ్ వేగానికి మించవద్దు. కొత్త వ్యక్తులు చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలి. ఇక్కడ రోడ్లపై పశువులు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. రాత్రి వేళ జంతువులు రోడ్డుమీదకు వచ్చే అవకాశాలు ఉంటాయి. వేగం కన్నా ప్రాణం మిన్న అనే నానుడిని మరువద్దు.

– ఎస్ఐ ముత్తయ్య, విజయపురి టౌన్

‘మహిళా శక్తి’ రుణాలతో ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మహిళలు మహిళా శక్తి రుణాలను తీసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా విభాగం ఆర్‌పీలు, సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ నిధి కింద మహిళా సంఘాలు రూ. 2.5కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించి కొత్త రుణాలను తీసుకోవాలన్నారు. స్త్రీ నిధి కింద ఈ సంవత్సరం రూ.8కోట్ల వరకు రుణాలు ఇవ్వాలని కోరుతున్నారన్నారు. మహిళా సంఘాల ద్వారా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో ఆర్‌పీలు తప్పనిసరిగా భాగస్వాములు కావాలన్నారు. సమావేశం అనంతరం నూతనంగా బాధ్యతలను స్వీకరించిన కమిషనర్ శ్రీనివాస్‌ను మెప్మా మహిళలు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి ఆర్ఎం బి. శ్రీలేఖ, మున్సిపల్ శానటరి ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ పరిరక్షణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ మల్లేశ్వరీ, ఉమా, టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఈఓ వెంకటేశ్వర్లు, ఆర్‌పీలు కళావతి, జాజుల చంద్రకళ, సరిత పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న మండలి చైర్మన్

మిర్యాలగూడ టౌన్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు రానున్న రోజుల్లో లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఎన్నికైన నూతన సభ్యుల ప్రమాణస్వీకారానికి ఆయన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొనకంచి వీర రాఘవులు, ప్రధాన కార్యదర్శి బికుమల్ల ఆనంద్‌కుమార్‌లు ప్రమాణాస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మురారి, భాగ్యలక్ష్మి, నాగయ్య, రాంరెడ్డి తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్లతో మాట్లాడుతున్న కళ్యాణ్ చక్రవర్తి

చింతపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది ముందుండాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు పర్యటించి ప్రజల రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ, సిబ్బంది వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీదేవి, ఎగ్బాల్ పాల్గొన్నారు.

మెస్ చార్జీలు చెల్లించాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ : గిరిజన సంక్షేమ హాస్టల్‌లో పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సైదానాయక్, డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, వీరన్న, పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్, సన్నీ, రఘు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



దేవరకొండ : పార్టీ జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



మిర్యాలగూడ : జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దేవరకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ అధ్యక్షుల సమ్మేళనానికి దేవరకొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించి మాట్లాడారు. తరలివెళ్లిన వారిలో నాయకులు నలగాసు జాన్‌యాదవ్, ఆలంపల్లి నర్సింహ, మారుపాకల సురేష్‌గౌడ్, దేవేందర్, శ్రీశైలంయాదవ్, రుక్మారెడ్డి, వేణుధర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి తదితరులు నాయకులు ఉన్నారు.

మిర్యాలగూడ : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నాయకుల సమ్మేళన కార్యక్రమానికి శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని రాజీవ్ గాంధీ స్టేడియం నుంచి వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఎల్ఓల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



త్రిపురారం : బీఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

త్రిపురారం : గ్రామ స్థాయిలో ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓల పాత్ర అంత్యంత కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల వ్యాప్తంగా గ్రామాల్లోని బీఎల్ఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ. పోలింగ్ బూతుల్లో సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. భూ భారతీలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే భూసమస్యల పరిష్కారం పై దృష్టిసారించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీలా, ఆర్ఐ సైదులు, ట్రైనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలకు జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, డీటీ ప్రశాంత్, ఆర్.ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సంగీత, , మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్, రమేష్, శేకర్, గోవర్ధన్‌రావు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : భవిత కేంద్రంలో పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా యాక్టివిటీ పెయింటింగ్, సీడబ్ల్యూఎస్ఎన్ టాయిలెట్స్ నిర్మాణం, డ్రిల్లింగ్ పనులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, స్వర్ణరేఖ, నాగసిద్ధార్థ పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

నిడమనూరు : గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశించారు. నిడమనూరు శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. మౌలిక సదపాయలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, టాయిలెట్లు, డ్యూయల్ డెస్కులు, పలు సౌకర్యాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, గిర్దావర్ సందీప్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు నివాళి



మిర్యాలగూడ టౌన్ : రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు



డిండి : ఎంపీడీఓ కార్యాలయంలో రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని శుక్రవారం స్థానిక వాసవి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్, రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమేష్, గౌరు శ్రీనివాస్, నాగరాజు, జాయిని రాములు, పాండు రంగయ్య, ఆయిల్ శ్రీనివాస్ తదితరులున్నారు. అలాగే మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాస్, డీఈఈ వెంకన్నలు రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నవీన్, ఆర్ఓ, మేనేజర్ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్య, టీపీబీఓ చరణ్‌తేజ, దయాకర్‌రెడ్డి, టీఎంసీ పాతేపాక బక్కయ్య, ఆర్ఐలు సాంబయ్య, సాజిదలతో పాటు సీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు రామయ్య, శేఖర్, సత్యం, పరమేశ్, లక్ష్మయ్య, గట్టు శ్రీను, కోటి, శేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య జయంతి వేడుకను అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, జూనియర్ అసిస్టెంట్లు మహేష్, సరిత సిబ్బంది పాల్గొన్నారు.

డిండి : మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య జయంతి వేడుకలు మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో వెంకన్న రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కొమురయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి



మిర్యాలగూడ అర్బన్ : కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దేవరకొండ : మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నెలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు, సామాజిక వేత్త డాక్టర్ జాడి రాజు, బీసీ సంఘం నాయకులు మురళియాదవ్, జయరాజు, జ్వాల వెంకటేశ్వర్లు, కస్తూరి ప్రభాకర్, బంటు కవిత, ఉరిబండి శ్రీనివాస్, పున్నా రాములు, కేపీ రాజు, శిరసనగండ్ల ఈశ్వరాచారి, సత్యప్రకాశ్ నాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భరత్, వెంకన్న తదితరులున్నారు.

మిర్యాలగూడ అర్బన్ : దొడ్డికొమురయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేములపల్లి : కొమురయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, భిక్షం, సైదులు, వెంకటేశ్వర్లు, పరుశురాములు, వీరయ్య పాల్గొన్నారు.

దేవరకొండ : మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య, దొడ్డి కొమురయ్య వర్ధంతి, సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, కలాం, భాషనాయక్, వీరయ్య, కోటేశ్వరరావు, లక్ష్మణ్‌నాయక్, ఏసోబు, గోవిందు, యాదయ్య, తదితరులున్నారు.

జూదరుల అరెస్ట్

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కేశ్యతండా నుంచి రామునిగుండ్ల తండాకు వెళ్లే మార్గంలో జూదం ఆడుతున్న వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తొమ్మిది మంది వ్యక్తులు జూదం ఆడుతుండగా స్థానిక ఎస్ఐ అజ్మీరా రమేష్ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పట్టుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు పట్టుబడగా నలుగురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి మూడు బైకులు, రూ.31వేల నగదు, ఐదు సెల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా శ్రీనివాస్‌గురూజీ



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

మిర్యాలగూడ : ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, బోధి ధర్మ ఆయుర్వేదిక్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ పండిట్ శ్రీనివాస్ గురూజీని పారంపర్య వైద్య మహాసంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా నియమించినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు సజ్జన రమేష్ తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్టలో నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కృషి చేస్తా

మిర్యాలగూడ టౌన్ : జిల్లాలోని క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డీఎస్‌డీఓ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) అక్బర్ అలీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. అనంతరం ఎన్ఎస్‌పీ క్యాంపు మైదానికి వచ్చిన డీఎస్‌డీఓను క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యంగ్ క్రికెటర్స్ శ్రీనివాస్, అతీఫ్, కోచ్‌లు రామకృష్ణ, రవీందర్, శ్రీధర్ బీసీ సంఘం నాయకులు మురళియాదవ్, తదితరులున్నారు.



డీఎస్‌డీఓను సన్మానిస్తున్న క్రీడాకారులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



నాగార్జునసాగర్ : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

నాగార్జునసాగర్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన గురుకుల విద్యాలయాన్ని ఆ ఆయన సందర్శించారు. విద్యాలయంలో విద్యాప్రమాణాలు, వసతి గదులు, భోజనసదుపాయాలు, శుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం విద్యాలయం ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ రవికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి తరి రాము,ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించి మాట్లాడారు. పాఠశాల సొంత భవనం, విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, బెడ్స్, మెనూ ప్రకారం భోజనం అందించే విషయాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ లావూరి బాలు, ప్రిన్సిపాల్ ఉమాదేవి, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.